1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు      తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 170 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 10 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 170 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 10 May 2025 PAGES : 8 PRICE : 3/-

# దేశాన్ని రక్షించే శక్తి మోదీ..



**ప్రధాని మోదీ నాయకత్వంలోనే**
**దేశానికి భద్రత అన్న చంద్రబాబు**
**ఉగ్రదాడులతో దేశం దిగ్భ్రాంతికి గురైందన్న సీఎం**
**వీరమరణం పొందిన సైనికుడు మురళీ కుటుంబానికి**
**పూర్తి అండగా ఉంటామని హామీ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 9)**

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అని చంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని చాయాపురంలో నేడు ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం ఒకరకమైన యుద్ధ వాతావరణాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. ఉగ్రవాదుల దాడులతో దేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గామ్‌లో అమాయకులైన -మిగతా 2లో

## భారత బలగాలకు రక్షణగా పవన్ కల్యాణ్ కీలక పిలుపు

**పాక్‌తో ఉద్రిక్తతల వేళ సైన్యానికి పవన్ మద్దతు**
**ఆపరేషన్ సిందూర్ కు నైతిక మద్దతుగా ప్రార్థనలు చేయాలని పిలుపు**
**జనసేన ఆధ్వర్యంలో పలు ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 9)**

పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, భారత సైనిక దళాలకు మద్దతుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. భారత బలగాలు శత్రుదేశంపై చేపడుతున్న 'ఆపరేషన్ సిందూర్' ఒక ధర్మయుద్ధమని అభివర్ణించిన ఆయన, ఈ ఆపరేషన్ విజయవంతం కావాలని, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సైన్యానికి దైవబలం, ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శత్రు సేనలను నిలువరించి, దేశాన్ని పరిరక్షించేందుకు అవసరమైన గొప్ప శక్తిసామర్థ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు పుష్కలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో దేశమంతా సైనికుల కోసం ప్రార్థించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జనసేన పార్టీ తరఫున రాబోయే మంగళవారం నాడు తమిళనాడులోని ఆరు ప్రసిద్ధ షణ్ముఖ క్షేత్రాలైన తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరంకుండ్రమ్, స్వామిమలై, పలముదిరచోళైలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి క్షేత్రానికి ఒక శాసనసభ్యుడిని, జన సైనికులను పంపించి పూజలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.వీటితో పాటు, కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాల్లో... ఆంధ్రప్రదేశ్‌లోని మోపిదేవి, బిక్కవోలు సుబ్రహ్మణ్య ఆలయాల్లో, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో, పిఠాపురంలోని శ్రీ పురుహూతికా దేవి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు.

అంతేకాకుండా, ఈ ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో, సైన్యానికి సూర్య శక్తి తోడుగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ క్షేత్రాల్లో కూడా భారత సైన్యం కోసం, యుద్ధ వాతావరణం నెలకొన్న జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హర్యాణా రాష్ట్రాల ప్రజల క్షేమం కోరుతూ పూజలు నిర్వహించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. క్రైస్తవ విశ్వాసులు చర్చిలలో, ఇస్లాంను ఆచరించేవారు మసీదులలో తమ ప్రార్థనలు కొనసాగించాలని ఆయన సూచించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న సైనికులకు ఆధ్యాత్మిక అండదండలు అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

## హిందూపురం నాకు ఓ నియోజకవర్గం కాదు... అది నా హృదయ స్పందన

**ఇటీవల ఢిల్లీలో పద్మభూషణ్ అందుకున్న బాలకృష్ణ**
**హిందూపురంలో సన్మానం**
**ఈ సన్మానం మరువలేనిదంటూ బాలకృష్ణ భావోద్వేగం**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 9)**

పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సందర్భంగా హిందూపురం ప్రజల ఆదరణకు హ్యాట్రిక్ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. హిందూపురంలో జరిగిన సన్మాన -మిగతా 2లో

## నా జీతం.. మీ జీవితం కోసం..'

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 9)**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. తన వేతనం మొత్తాన్ని అనాథ బిడ్డల సంక్షేమానికి వినియోగించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.2,10,000 ఆర్థిక సాయాన్ని అందించారు. తన వేతనంలో మిగిలిన మొత్తాన్ని సైతం వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యేగా నన్ను గెలిపించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధితోపాటు సమస్యలను పరిష్కరించడం నా బాధ్యత. పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన వేతనాన్ని అక్కడే వినియోగించాలని నిర్ణయించుకున్నా. ఇందులో భాగంగా నియోజకవర్గం పరిధిలో తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డల భవిష్యత్తు కోసం ఇస్తా. పదవి ఉన్నంతకాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తా" అని ప్రకటించారు.

## పాక్‌తో ఉద్రిక్తతల వేళ.. త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ




## సరిహద్దు ఉద్రిక్తతలు.. 24 ఎయిర్‌పోర్టులు మూసివేత





## భారత్-పాక్ ఉద్రిక్తతలు 80వేల దిగువకు సెన్సెక్స్

**భారత్-పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కుదేలు**
**880 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**
**విమానయాన, పర్యాటక, స్థిరాస్తి రంగ షేర్లలో అమ్మకాలు**
**రక్షణ రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 9)**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర




ప్రతికూల ప్రభావం చూపాయి. పాకిస్థాన్ దళాలు సరిహద్దు ప్రాంతాలపై దాడులకు పాల్పడటం, భారత సైన్యం వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతో యుద్ధ భయాలు మరింత ముదిరాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో దేశీయ సూచీలు వరుసగా రెండో రోజూ కూడా -మిగతా 2లో

## భానుడి భగభగ... ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత

**కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ వర్షపాతం**
**రేపు 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు.**
**అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షాలు.**
**ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచన**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 9)**



ఏపీలో కొన్ని జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. నేడు రాష్ట్రంలోని పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, కొన్ని ప్రాంతాల్లో వర్షం పాతం నమోదైంది. రేపు శనివారం కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే -మిగతా 2లో

## 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య – భారత్

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 9)**

భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది.

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు."గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది.పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర -మిగతా 2లో



మొదటి పేజీ తరువాయి

# దేశాన్ని రక్షించే శక్తి మోదీ..

మన వారిని ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రపంచంలో ఎక్కడా హింసకు తావులేదని ప్రధాని పదేపదే స్పష్టం చేస్తుంటారని గుర్తుచేశారు.పాకిస్థాన్ నిరంతరం మన దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, దాడులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. దేశ రక్షణ కోసం ఎంతో మంది యువకులు సైన్యంలో చేరుతున్నారని, వారి త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన తెలుగు బిడ్డ, సైనికుడు మురళీ నాయక్ గురించి ప్రస్తావిస్తూ, ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రులతో తాను మాట్లాడి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశానని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. అనంతరం, చంద్రబాబు "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేశారు. వీరమరణం పొందిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

# భారత్-పాక్ ఉద్రిక్తతలు 80వేల దిగువకు సెన్సెక్స్

భారీ నష్టాలను చవిచూశాయి. దాదాపు అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో సెన్సెక్స్ కీలకమైన 80 వేల పాయింట్ల మార్కును కోల్పోగా, నిఫ్టీ 24 వేల పాయింట్ల సమీపంలో ముగిసింది. సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా విమానయానం, పర్యాటకం, స్థిరాస్తి వంటి రంగాల షేర్లు అధికంగా నష్టపోయాయి. అయితే, రక్షణ రంగ సంస్థల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ముఖ్యంగా డ్రోన్ల తయారీ సంస్థ ఐడియా ఫోర్జ్ షేర్లు ఏకంగా 18 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ దాదాపుగా స్థిరంగా ముగియగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం నష్టపోయింది.

ఉదయం సెన్సెక్స్ 78,968.34 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగిన సూచీ, ఇంట్రాడేలో 78,968.34 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 880.34 పాయింట్ల నష్టంతో 79,454.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 265 పాయింట్లు నష్టపోయి 24,008 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.41 వద్ద నిలిచింది.

సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. టైటాన్, టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ, ఎస్బీఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాలతో ముగిశాయి.

# హిందూపురం నాకు ఓ నియోజకవర్గం కాదు... అది నా హృదయ స్పందన

సభను జీవితంలో మరువలేని అనుభూతిగా అభివర్ణించారు. ప్రజల అభిమానం తండ్రికి పిల్లలు చూపిన ఆత్మీయతలా అనిపించిందని వ్యాఖ్యానించారు. హిందూపురం కేవలం నియోజకవర్గం కాదని, తన హృదయ స్పందన అని ఉద్ఘాటించారు. ప్రజల ప్రేమకు జీవితాంతం నిస్వార్థ సేవతో బదులిస్తానని భావోద్వేగ హామీ ఇచ్చారు."పద్మభూషణ్ అనే గౌరవప్రదమైన పురస్కారం లభించిన ఈ ఆనందకరమైన క్షణాల్లో, నా ప్రియమైన హిందూపురం ప్రజలు చూపిన ఆత్మీయత, ప్రేమ, ఆదరణ... నాకు చిరకాలంగా గుర్తుండిపోయే అనుభూతిని ప్రసాదించాయి. మీరు ఏర్పాటు చేసిన సన్మాన సభ... హృదయాన్ని తాకే మధుర ఘడియలు%లల% నా జీవితంలో మరువలేని అనుభవంగా నిలిచిపోయింది.అది ఒక నాయకునికి ప్రజలిచ్చే గౌరవం కంటే... ఒక తండ్రికి తన పిల్లలు చూపే ఆత్మీయతలా అనిపించింది. మీరు చూపిన ఆ ప్రేమ ఒక శక్తిగా, ఆశీర్వాదంగా మారి, నా జీవితం మొత్తానికీ వెలుగులా నిలుస్తుంది. హిందూపురం నాకు ఓ నియోజకవర్గం కాదు... అది నా హృదయపు స్పందన...నా హృదయంలో చిరకాలంగా తీయగా మోగే జననీ స్వరం... ప్రతి చిరునవ్వులో నన్ను నిలబెట్టిన నిస్వార్థ ప్రేమ స్థలం.మీరు ఇచ్చిన ప్రేమకు బదులివ్వలేను కానీ... జీవితాంతం మీ సేవలో నిస్వార్థంగా ఉండే ప్రయత్నం మాత్రం తప్పకుండా చేస్తాను. మీరు చూపిన నిస్వార్థ ప్రేమకు నేను ఎప్పటికీ ఋణపడి ఉంటాను. ఈ గౌరవాన్ని ఇచ్చిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నా హిందూపురం నియోజకవర్గ ప్రజలకు నా హృదయపూర్వక నమస్కారాలు. మీ ప్రేమను ఈ జీవితంలో మరచిపోలేను" అని బాలయ్య సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు.

# భానుడి భగభగ... ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత

అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది.ఇవాళ ప్రకాశం జిల్లా దరిమడుగులో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మరోవైపు, కొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అత్యధికంగా 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా చొప్పెలలో 55 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆకస్మిక వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

**వాతావరణ సూచన**

రేపు శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ అంచనా వేసింది. మూడు మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 23 మండలాల్లో వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది.అదే సమయంలో, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇతర జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.

# 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య - భారత్

విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.

# పాక్‌తో ఉద్రిక్తతల వేళ.. త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 9)

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నడుమే ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులకు తెగబడటం.. భారత్ సైతం వాటిని దీటుగా తిప్పికొట్టిన తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

# సరిహద్దు ఉద్రిక్తతలు.. 24 ఎయిర్‌పోర్టులు మూసివేత

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 9)

భారత్-పాక్ నడుమ ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్‌లోని పలు విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేయనున్నారు. శ్రీనగర్, చండీగఢ్ సహా మొత్తం 24 ఎయిర్‌పోర్టుల్లో పౌర విమానాల రాకపోకలను నిలిపివేశారు. తొలుత మే 10 వరకు రాకపోకలపై ఆంక్షలు ఉండగా.. తాజాగా మరో ఐదు రోజులు పొడిగించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఆయా ఎయిర్‌పోర్టులకు రాకపోకలు రద్దు చేసినట్లు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ క్రమంలోనే జమ్మూ, చండీగఢ్‌లో చిక్కుకున్న విమాన ప్రయాణికుల కోసం రైల్వేశాఖ 4 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది.చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లుథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, భఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బికానేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేసినట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఈ మేరకు నోటిఫికేషన్ వెలువడగానే ఎయిరిండియా 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ప్రయాణికులకు ఉచితంగా రీషెడ్యూల్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఒకవేళ రద్దు చేసుకుంటే.. పూర్తి రీఫండ్ చెల్లిస్తామని తెలిపింది. ఇండిగో సైతం ఇదే తరహా ప్రకటన వెలువరించింది.

# కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం

## సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 9)

మండలంలోని ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని కరేడు సెక్టార్ ఆకుతోట సంఘం నందు సిడిపిఓ సూచనల మేరకు శుక్రవారం సూపర్వైజర్ ఎం. నాగలక్ష్మి కిషోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మే 2వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారం లో 11-14, 15-18 సంవత్సరాల కిషోరి బాలికలకు జరుపబడుతుంది. ఈ కార్యక్రమంలో నా పోషణ అవసరాలు గురించి తెలిపారు. పోషణపై ప్రాథమిక సమాచారం సమతుల్య ఆహారం, కౌమార ,బాల, బాలికలలో పోషకాహార లోపం, అధిక బరువు , ఊబకాయం, సూక్ష్మ పోషకాల లోపం, ఐరన్ లోపం, రక్తహీనత గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంకేఏస్ కల్పవల్లి, ఏ డబ్ల్యు డబ్ల్యు సిహెచ్ పద్మజ, తల్లులు కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

# వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు

## ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో అర్ధరాత్రి వరకు తనిఖీలు







(షణ్ముఖ వెలుగు, కంభం, మే 9)

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఉగ్రవాద దాడులు, దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున పట్టణంలోని కందులాపురం సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. కంభం సీఐ మల్లికార్జున్, ఎస్ఐ నరసింహారావు కంభం పట్టణం మీదుగా ప్రయాణించే పలు వాహనాలను సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీలు నిర్వహించిన అనంతరం సీఐ మల్లికార్జున్, ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులు, పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్నందున ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. ఎవరైనా అనుమానితులు ఉంటే వెంటనే వారిని విచారించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమని నేరం రుజువు అయిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే వాహనదారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ మల్లికార్జున్, ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 9)

కిశోరి వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా కిశోరి బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను నష్టాలను గర్భస్రావం శిశు మరణాలు మాతృ మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, 18 సంవత్సరాలు వయసు నిండిన వారికి మాత్రమే వివాహానికి అర్హులన్నారు. మండలంలోని 19 పంచాయతీల కన్వీనర్లు మహిళా సంరక్షణ కార్యదర్శి అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్ఎం లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు సిడిపిఓ మాధవి లత , సూపర్వైజర్ విక్టోరియా రాణి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



# నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఫారం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతితో పాటు లేబర్ మొబిలైజేషన్ పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, మండల ప్రత్యేక అధికారులను, ఎంపీడీవోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఫారం పాండ్స్ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఫారం పాండ్స్ నిర్మాణాలను పుర్తిచేయాలన్నారు. మే మాసాన్ని ఫారం పాండ్స్ మాసంగా ప్రకటించడం జరిగిందని, ఈ మాసంలో 1680 ఫారం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఫారం పాండ్స్ నిర్మాణాలను పూర్తీ చేసేలా మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా లేబర్ మొబిలైజేషన్ పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు కూలీలకు రోజువారి సగటు వేతనం పెరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. లేబర్ మొబిలైజేషన్‌లో కొనకనమిట్ల, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, వెలిగండ్ల మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి వున్నాయని, సంబంధిత మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ లు లేబర్ మొబిలైజేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 1,376 పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 1080 నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని, మిగిలినవి రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జోసెఫ్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఏపిడిలు, ఏపిఓలు తదితరులు పాల్గొన్నారు.



# ధృవపత్రాలు లేని వాహనాలకు చలానా



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 9)

జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాలతో కొండపిలోని ప్రధాన రహదారి కూడళ్లలో సరైన ధ్రువపత్రాలు హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న మోటార్ సైకిళ్ళను ఎస్ఐ ప్రేమ్ కుమార్ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు చలనాలను విధిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంకమ్మరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)**

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా, అంతర్గత భద్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన రోడ్డు మార్గాలు, రద్దీ ప్రాంతాలు, ముఖ్య కూడళ్ళు, ప్రజలు ఎక్కువగా సంచరించే, నిరంతరం రద్దీగా ఉండే ప్రదేశాలలో పోలీస్ అధికారులు, సిబ్బంది, బీడీ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ సహాయంతో స్పెషల్ డ్రైవ్ లో జిల్లా అంతటా విస్తృతంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, బస్టాండ్ లు, రైల్వేస్టేషన్ లు, బార్డర్ చెక్పోస్టులు ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో





శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజల యొక్క భద్రత మరియు రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఆకస్మిక తనిఖీల నిర్వహణ అనేది నేరాలను అదుపులో ఉంచడానికి మరియు ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించడానికి దోహదపడుతుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నామని భరోసా ప్రజలకు కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల కదలికలను నియంత్రించడానికి తనిఖీలు మరింత పటిష్ట పరచడం జరిగింది. దీని ద్వారా జిల్లాలోని ప్రజలు ప్రశాంతం ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని (తరువాయి 4లో...)

# అమరవీరునికి అంతిమ వీడ్కోలు

## ఎమ్మెల్యే ఉగ్ర ఘన నివాళి

## పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 9)**

మావోయిస్టుల దాడిలో వీర మరణం పొందిన గ్రేహౌండ్స్ పోలీసు కానిస్టేబుల్ నూకతోటి పవన్ కళ్యాణ్ (22)కు ఘన నివాళులర్పించారు. పీసీపల్లి మండలం ముద్దపాడుకు చెందిన నూకతోటి పవన్ కళ్యాణ్ మావోయిస్టుల దాడిలో శుక్రవారం మృతి చెందారు. పవన్ కళ్యాణ్ భౌతిక ఖాయాన్ని ఆయన స్వగ్రామం ముద్దపాడుకు తీసుకువచ్చారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వీరజవాన్ పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఘన నివాళులర్పించారు. కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో డివిజన్‌లోని సిఐలు భీమానాయక్, ఖాజావలితో పాటు ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, పోలీసు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్‌కు వీర మరణాన్ని పలువురు కొనియాడారు. పవన్ కళ్యాణ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తాము ఎళ్ళప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌లు భరోసా ఇచ్చారు. పవన్ కళ్యాణ్ మృతి బాధాకరమని అయినా మీ కుమారుడు వీర మరణం పొందారన్నారు.






గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అంతిమయాత్రను నిర్వహించారు. వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ కూడా పవన్ కళ్యాణ్‌కు ఘన నివాళులర్పించారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)**

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలతో, మునిసిపల్ కమీషనర్లతో సమావేశమై వేసవిలో తాగునీటి సరఫరాపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎక్కడా ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడరాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందుకు అనుగుణంగా వేసవిలో సురక్షిత తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరికీ రక్షిత మంచినీరు (తరువాయి 4లో...)

# ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)**

వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం భవనములోని గ్రీవెన్స్ హాలులో హౌసింగ్ పథకముపై సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీన సామూహికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున జిల్లాలో లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ముఖ్యంగా ఆప్షన్ - 3, పీఎం జన్ మన్ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పిఎం జన్ మన్ ఇళ్ళ నిర్మాణంలో పురోగతిని నేరుగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనముగా ఆర్థిక సహాయం చేస్తున్నందున ఈ డబ్బులను కేవలం ఇళ్ల నిర్మాణాలకే లబ్ధిదారులు ఉపయోగించుకునేలా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఇది కేవలం హౌసింగ్ డిపార్ట్మెంట్ పని అంటూ ఎంపీడీవోలు తేలికగా తీసుకుంటే ఊరుకోనని ఆమె హెచ్చరించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు కూడా ఈ విషయంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈవో చిరంజీవి, మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఈ.ఈ.లు, డి.ఈ.ఈ.లు, ఏ.ఈ.ఈ.లు పాల్గొన్నారు.



### ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డులు జారీలో నిర్లక్ష్యం తగదు

ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసేలా చూడడంలో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సంబంధిత అధికారులతో శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సాధించి సమీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ దృష్ట్యా జనన ధ్రువీకరణ పత్రం ఉన్న చిన్నారులకు తక్షణమే ఆధార్ కార్డుల జారీ కోసం వివరాలను నమోదు చేయించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ వివరాల నమోదు కోసం చిన్నారులను ప్రత్యేక శిబిరాలకు తరలించి, పోస్ట్ ఆఫీసులు, కామన్ సర్వీస్ సెంటర్లలోని సిబ్బందిని అక్కడకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనన, ధ్రువీకరణ పత్రాలు లేని చిన్నారులు గుర్తించి వారు జన్మించిన ఆసుపత్రుల వివరాలు తెలుసుకొని ఏ విధంగా జనన ధ్రువీకరణ




# ఉడుముల ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

## 16 ఏళ్ల అమ్మాయిలో 2.8 కిలోల ఆండాశయ నీటి గడ్డ తొలగింపు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 9)**

ఉడుముల ఆసుపత్రిలో డాక్టర్ ఎస్.వి. గీతికారెడ్డి నేతృత్వంలో 16 సంవత్సరాల యువతికి 2.8 కిలోల బరువుతో ఉన్న ఆండాశయ నీటి గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ యువతి ఇటీవల తీవ్రమైన పొట్ట నొప్పి, వాంతులు, పొట్ట ఉబ్బుదల వంటి సమస్యలతో ఆసుపత్రికి చేరింది. వైద్య పరీక్షలలో ఆమె గర్భాశయం వద్ద భారీ నీటి గడ్డ ఉన్నట్లు గుర్తించబడింది. వెంటనే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేసి, సంపూర్ణ ఓపెన్ శస్త్రచికిత్స విధానం ద్వారా ఆ గడ్డను పూర్తిగా తొలగించారు. డాక్టర్ ఎస్.వి. గీతికా రెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్ద గడ్డ చిన్న వయస్సులో రావడం అరుదు. దీన్ని తొలగించడంలో మా బృందం శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. రోగిని తక్కువ సమయంలోనే కోలుకునేలా చూసాం . ప్రస్తుతం రోగిని ఆరోగ్యంగా కోలుకుంటూ ఉంది, వైద్య బృందం నిత్యం పర్యవేక్షిస్తోంది. ఉడుముల ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ముందు ఉంటుందన్నారు.



# ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలి

పత్రాలను పొందవచ్చో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు కూడా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయా విషయాలను సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా సచివాలయాల ద్వారా అందే సేవలు " మనమిత్ర " యాప్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. " శక్తి " మొబైల్ యాప్ ను అందరూ డౌన్లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవి, మండలాల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సిడిపిఓలు పాల్గొన్నారు.

**దుర్బలమైన చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి**

దుర్బలమైన (వల్నరబుల్) చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇలాంటి పిల్లల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా జిల్లాలో ' బంగారు బాల్యం ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. శుక్రవారం సంబంధిత అధికారులతో ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. ఇందుకోసం దుర్బలమైన పిల్లల వివరాలను సేకరించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొబైల్ , వెబ్ యాప్ ను రూపొందించినట్లు ఆమె చెప్పారు. ఈ యాప్ లో పొందుపరిచిన వివరాలను, దీని పనితీరును బంగారు బాల్యం నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాచర్ల మండలంలో ఇప్పటికే ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇతర మండలాల్లో కూడా సర్వే చేయాల్సి ఉన్నందున ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమ్మిళితం చేసి దుర్భలమైన పిల్లలకు, వారి కుటుంబాలకు సమర్థంగా అవి అందేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా ఆయా కుటుంబాలు పేదరికం నుంచి బయటపడేలా, దుర్భలమైన పిల్లలు కూడా ఎలాంటి వేధింపులు, దోపిడీకి గురికాకుండా సాధికారత దిశగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజాగా పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని ఆమె ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ' బంగారు కుటుంబా'లకు సహాయం చేసేలా ' మార్గదర్శ ' కులను కూడా ఇదే సమయంలో గుర్తించాలన్నారు. బంగారు కుటుంబాల పై మండలాల ప్రత్యేక అధికారులు కూడా మరింత దృష్టి పెట్టి సమీక్షించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, సిడిపిఓలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



అందించేందుకు రక్షిత తాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్స్‌కు మరమ్మత్తులు చేయించాలన్నారు. అందుకు అ0వసరమైన నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బోర్ వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి త్రాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నందున, జిల్లాలోని అన్ని గ్రామాలలోని త్రాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లా లో ఎక్కడా త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు ఓవర్ హెడ్ ట్యాంకులను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పంచాయతీ రాజ్, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల త్రాగునీటి అవసరాల కోసం ఒంగోలు జల్ శక్తి కేంద్రంలో 9618055155 టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నెంబర్ అవగాహన కొరకు రూపొందించిన వాల్ స్టికర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, డిపిఓ వెంకట నాయుడు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి

జిల్లా ఎస్పీ అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. ఒకవైపు వాహనాలు తనిఖీ చేస్తూనే పోలీసులు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు గురించి తెలియచేస్తున్నారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు, ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు.







# అమరవీరునికి అంతిమ వీడ్కోలు







# పునరుత్పత్తి ఆరోగ్యం-బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 9)

బంగారు బాల్యంలో భాగంగా కిశోరి వికాసం కార్యక్రమంలో శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో టకరిపాలెం అంగన్‌వాడీ కేంంద్రం నందు కిశోర బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం- బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి బాలికల కోసం పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన చాలా ముఖ్యం అని ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ మల్లేశ్వరి అన్నారు. వారిలో శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు సురక్షిత భవిష్యత్తును అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పునరుత్పత్తి ఆరోగ్యానికి సంబంధించిన శరీర అభివృద్ధి అవగాహన,లైంగిక విద్యా,వ్యక్తిగతపరిశుభ్రత,ఆత్మవిశ్వాసం మరియు భావోద్వేగ నియంత్రణ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కలిగించారు.బాల్యవివాహం నేరం మాత్రమే కాదు అది ఒక జీవితాన్ని దెబ్బతీసే దారుణమని బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు , ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫెసిలెటర్ ఏ ఎన్ ఎం లక్ష్మి, ఎన్ ఐ ఆర్ డి సర్టిఫైడ్ మాస్టర్ రిసోర్స్ పర్సన్ బంగారు బాల్యం కమిటి సభ్యులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఒంగోలు జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

## మెదడు కింద భాగంలో గడ్డను తొలగించి ప్రాణాపాయం తప్పించిన వైద్యులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)



ఒంగోలులోని జిజిహెచ్ లో అరుదైన ఆపరేషన్ జరిగింది. మెదడు భాగంలోని వెన్నుపూస వద్ద వచ్చిన గడ్డను సకాలంలో గుర్తించి ఆపరేషన్ ద్వారా దానిని విజయవంతంగా తొలగించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చేయలేని అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్ ను జీజీహెచ్ లోని న్యూరో సర్జన్ విభాగం విజయవంతంగా చేసింది. ఆ ఆపరేషన్ చేయడం ఆలస్యం అయితే ఆ వ్యక్తి ప్రాణాల మీదకు వచ్చేది. అత్యంత అరుదైన క్లిష్టకైన ఆపరేషన్ చేసిన న్యూరో సర్జన్ విభాగం హెచ్ఓడీ గోపికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వలిబాబు, మురళీకృష్ణలను జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏడుకొండలరావు అభినందించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ మీడియాకు వివరించారు. రాపర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన ఐజక్ బెల్దారి మేస్త్రీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే తొమ్మిది నెలల నుండి ఐజక్ కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం, చేతులతో చిన్న బరువు కూడా మోయలేని పరిస్థితికి వచ్చాడు. భయాందోళన చెందిన ఐజక్ హైదరాబాద్, గుంటూరు, విజయవాడలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించుకున్నాడు. అయితే సమస్యను గురించకపోగా, వారు ఇచ్చిన మాత్రలు మింగుతూ వచ్చాడు. సమస్య తగ్గకపోగా మరింత పెరిగిపోయింది. దాంతో ఏమి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్న తరుణంలో ఒంగోలు జీజీహెచ్ లో చూపించుకోమని ఒక వ్యక్తి సలహా ఇవ్వడంతో ఇక్కడకు వచ్చాడు. జీజీహెచ్ లోని న్యూరో సర్జన్ విభాగం ఐజక్ కేసును చాలెంజ్ గా తీసుకుంది. ముందుగా ఎం ఆర్ ఐ స్కాన్ తీయించగా, మెదడు కింద భాగంలోని వెన్నుపూస వద్ద గడ్డ ఉండటాన్ని గుర్తించారు. ఆపరేషన్ ద్వారా ఆ గడ్డను తొలగించారు. అది సాధారణ గడ్డ లేకుంటే క్యాన్సర్ గడ్డ అని నిర్ధారించేందుకు దానిని ల్యాబ్ కు పంపించారు. ప్రస్తుతం ఐజక్ ఆరోగ్యంగా ఉన్నాడు. తాను నడవలేని స్థితిలో ఇక్కడకు వస్తే, ఆపరేషన్ విజయవంతం చేసి చక్కగా నడిచేలా చేశారని ఐజక్ తనకు ఆపరేషన్ చేసిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్ కుమార్, డిప్యూటీ ఆర్ఎంఓ పిచ్చయ్య, న్యూరో సర్జన్ విభాగం హెచ్ ఓ డీ గోపికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వలిబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)

గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించేలా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలతో సమావేశమై జిల్లా లో జరుగుచున్న పంచాయతీ రాజ్ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రజలకు సురక్షితమైన త్రాగు నీరు అందించేలా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం ప్రతి నెలా ఒక్కో అంశంతో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు పటిష్టంగా నిర్వహిం చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి 250 కుటుంబాలకు క్లాప్ మిత్ర లను నియమించడం జరిగిందని, గ్రామాలలో చెత్త సేకరణ విధులు ఖచ్చితంగా జరిగేలా చూడాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకు ల క్లీనింగ్ ప్రక్రియ 15 రోజుకొకసారి ఖచ్చితంగా జరిగేలా చూడటంతో పాటు బ్లీచింగ్ తగిన మోతాదులో కలిపేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# 33 మందికి రూ.34.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి
## పంచాయతీరాజ్ రోడ్ల కోసం రూ.24 కోట్లతో అంచనాలు
## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 9)**
అద్దంకి నియోజకవర్గంలోని 33 మంది లబ్దిదారులకు రూ. 34.77 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం చిలకలూరిపేట లోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సరే పేద ప్రజల పాలిట కూటమి ప్రభుత్వం ఆపన్న హస్తంగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే .. మరో పక్క హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి



ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్ఓసీలు అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని పేర్కొన్నారు. అనంతరం అద్దంకి పరిధిలో జరిగే బీటీ రోడ్ల నిర్మాణ పనులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో జరిగే రోడ్ల నిర్మాణం, నాణ్యత విషయంలో అధికారుల పర్యవేక్షణ తప్పక ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరు, నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు రోడ్ల నాణ్యత పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దమ్ము చక్రాల వాహనాల వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాంత ప్రజలే బాధ్యతగా తీసుకుని వాహనాల రాకపోకలను కట్టడి చేయాలని కోరారు. తమ ప్రాంత రోడ్లు బాగుండాలంటే దమ్ము చక్రాల వాహనాలను రోడ్లపైకి అనుమతించకుండా అధికారులతో పాటు స్థానికులు చూడాలన్నారు. అదే విధంగా పంచాయితీరాజ్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.24 కోట్లతో అంచనాలు రూపొందించి నిధుల కోసం సంబంధిత శాఖకు పంపామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.



# ఎన్ఎస్పీ కెనాల్ పై ఉన్న బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి జనార్దన్ రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మే 9)**
త్రిపురాంతకం నుండి యర్రగొండపాలెం వెళ్ళే మార్గంలో బాల త్రిపుర సుందరిదేవి ఆలయానికి సమీపంలో ఎన్ఎస్పీ కెనాల్ పై ఉన్న ఇరుకు బ్రిడ్జిని రాష్ట్ర రోడ్లు , భవనాలు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో వాహనాల రాక రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, డబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే వాహనాల రాకపోకలకు సులువుతుందని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి ఎరిక్షన్‌బాబు తీసుకువచ్చారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

# ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి సీనియర్ నేత

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)**
కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో పెద్ద సంఖ్యలో విడవలూరు మండల నుండి భారీ ఎత్తున వైకాపా అనుచరులతో కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అచ్యుత రెడ్డి కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. విడవలూరు, రామతీర్థం, గాజులదిన్నె, రామచంద్రాపురం, రామతీర్థం, వావిళ్ళ, దండిగుంట, దంపూరు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేందర్ రెడ్డి, దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ, విడవలూరు సర్పంచ్ యాటగిరి ప్రవీణ్, మాజీ ఎంపిటీసీ కొమ్మిరెడ్డి మురళి రెడ్డి, చౌకిచర్ల మాజీ సర్పంచ్ అళగిరి వినోద్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు ఏనేటి ప్రసాద్, రామతీర్థం ఆలయ మాజీ ఛైర్మెన్ నాటారు చంద్రయ్య, అలగానిపాడు ఎంపిటిసి చింతాడి జగన్మోహన్, మాజీ ఉప సర్పంచ్ పొన్నం సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటరమణ, వీరారెడ్డి పల్లి ఉప సర్పంచ్, గౌడ సంఘం అధ్యక్షులు కోసూరు రవిలతో పాటు విడవలూరు మండల వైసిపి సీనియర్ నాయకులు నిమ్మల రవీంద్ర, మౌలాలి, పొన్నపూడి తాతారావు, కాటం శీనయ్య, ఆవుల సుధీర్, కంది మునిస్వామి, కంది వేణు చేబ్రోలు జనార్దన్ తదితర నాయకులను పేరు పేరునా స్వాగతం పలుకుతూ ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ పేదల ఆకాంక్షలను, యువత ఆశలను, మహిళల సాధికారతను, రైతుల సంక్షేమాన్ని కాపాడే పార్టీగా ఆమె అభివర్ణించారు. విభేదాలకు తావు లేకుండా అభివృద్ధి అన్న ఏకైక లక్ష్యంతో పనిచేసి పెట్టి గ్రామాభివృద్ధికి పాటు పడాలని తెలియజేశారు. అభివృద్దే టిడిపి నినాదం, సంక్షేమమే చంద్రబాబు నాయుడు విధానమన్నారు కోవూరు తెలిపారు. అనంతరం వైసిపి నాయకులు పూండ్ల అచ్యుత్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేస్తున్న అభివృద్ధి, పార్టీలకతీతంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఆకర్షితులమై టిడిపిలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే నాయకత్వంలో కోవూరు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.





# పాఠశాలల పునర్వ్యవస్థీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలి

## ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్దన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)**
విద్యారంగా సంస్కరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్దన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సంఘ ఉపాధ్యాయులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాకా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ మూడంచెల నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు.అందులో భాగంగా నేడు అన్ని జిల్లాల కేంద్రంలో ధర్నా కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు, ప్రాథమిక పాఠశాల 1 నుండి 5వ తరగతిలో మోడల్ ప్రాథమిక పాఠశాలలైన బేసిక్ ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలని అన్నారు.ఇప్పటికే ఉనికిలో ఉన్న ఆరు నుండి పదో తరగతి 12వ తరగతి పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.గతంలో ఉన్న ఆరు రకాల విద్యకు బదులు ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది రకాల విద్యను తీసుకోవడం ఉపాధ్యాయ సంఘాలుగా తాము ఖండిస్తున్నాం అని అన్నారు,వాటితో పాటుగా 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ రాష్ట్రంలోని అన్ని ఉపాధయ్య సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి విద్య రంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు.నిరసన కార్యక్రమాల్లో భాగంగా 14వ తేదీన విజయవాడ కేంద్రంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు.ఉపాధ్యాయులు చేస్తున్న ధర్నా కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఎన్జీవో సంఘం తమ సంపూర్ణ మద్దతును తెలియజేసింది.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసులు ఉపాధ్యక్షురాలు తిరుమల, జోనల్ కన్వీనర్ బి శేషారావు , ప్రకాశం జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష కార్యదర్శులు కే.శరత్ బాబు, ఆర్ సి హెచ్ కృష్ణారెడ్డి,శివ,కొత్తపల్లి మంజేష్ తదితరులు పాల్గొన్నారు.







# భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

## కంభం సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని అభినందించిన డిఎస్పి నాగరాజు



**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 9)**
కంభం పట్టణంలోని కాపు వీధిలో మద్యానికి బానిసై వేధిస్తున్నాడని భర్తను భార్య హత్య చేసిన ఘటనను పోలీసులు చేదించారు. కంభం పట్టణంలో ఈనెల 3వ తేదీన ఈ సంఘటన చోటు చేసుకుంది. మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై వేధిస్తున్నాడని భర్తను భార్య హత్య చేసి, హత్య తర్వాత భార్య, భర్త అనారోగ్యంతో మృతి చెందాడని నమ్మించే ప్రయత్నం చేసినట్లుగా మీడియా సమావేశంలో డి.ఎస్.పి నాగరాజు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి శుక్రవారం నిందితురాలిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రిమాండ్‌కు తరలిస్తున్నామని ఆయన తెలిపారు. అలానే మర్డర్ కేసును సాధారణ మరణంగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకుని, లోతుగా దర్యాప్తు చేసి, ముద్దాయిని అరెస్ట్ చేసినందుకు సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహారావు, సిబ్బందిని డిఎస్పీ నాగరాజు అభినందించారు.

# కిషోర వికాసం – వేసవి శిక్షణ కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 9)**
మండలంలోని ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని వీరేపల్లి పంచాయితీ వీరేపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రం నందు సూపర్వైజర్ ఏ. నాగలక్ష్మి అధ్యక్షతనలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండకుండానే వివాహం చేసుకోడాన్ని లేదా కలిసి జీవించడాన్ని బాల్య వివాహం అంటారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య ప్రభావాల గురించి వివరించడం జరిగింది. బాల్య వివాహాల నిరోధం నందు కౌమార సమయస్కుల బృందాల పాత్ర గురించి వివరించారు. బాల్య వివాహాలు వలన కలిగే విద్య సంబంధిత సమస్యలు, సామాజిక సమస్యల గురించి వివరించడం జరిగింది. బాల్య వివాహాలకు సంబంధించిన చట్టాలు మరియు చైల్డ్ హెల్ప్ లైన్ గురించి వివరించారు. కౌమార బాలికలు పోషకాహార లోపల, అధిక బరువు, ఊబ కాయం, రక్తహీనత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు , కిశోర బాలికలు, ఆశ కార్యకర్త, తల్లులు పాల్గొన్నారు.

# రెండో పంటలో నీటి పొదుపు కీలకం

## అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు సాగాలి
## ఎక్కువ దిగుబడి కోసం ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి
## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)**
తోటపల్లి గూడూరు మండలం ముంగలదొరువు వద్ద కోడూరు కాలువలో మరమ్మతులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. రైతులతో కలిసి పనుల పరిశీలన..నాణ్యతతో చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన రెండో పంటకు సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఏబీ సమావేశంలో తీర్మానించాంచారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు ఒక లక్ష ఎకరాల్లో పంట పెడతారని భావిస్తున్నామన్నారు. సోమశిల జలాశయంలో ప్రస్తుతం 50 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తాగునీటి అవసరాలు, డెడ్ స్టోరేజీ పోను 35 టీఎంసీలు నికరంగా ఉంటాయి. సర్వేపల్లి, కనిగిరి రిజర్వాయర్లలోనూ అదనంగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. కొందరు రైతులు రెండో పంట సాగుకు ఆసక్తి చూపుతుండగా, మరికొందరు వేయమంటున్నారు. ఎవరు పంట పెట్టినా నీటిని పొదుపుగా వాడుకోవాలిఒక్క చుక్క నీటిని కూడా వృథా చేయవద్దు. 2023 రెండో పంట సీజన్ లో 1.05 లక్షల ఎకరాలకు 41 టీఎంసీల నీటిని వాడేశారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ పనులు చేయకుండానే చేసినట్లు చూపి వందల కోట్లు స్వాహా చేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనూ రూ.150 కోట్లకు పైగా కుంభకోణం జరిగింది. కాలువలు రూపు కోల్పోవడంతోనే 1 టీఎంసీకి 10 వేల ఎకరాల్లో పంట పండించాల్సింది పోయి 1.05 లక్షల ఎకరాలకు 41 టీఎంసీలు ఖర్చు చేశారు. గతంలో జిల్లాలో సాగునీటి కొరత ఏర్పడినప్పుడు అందరిని సమన్వయం చేసుకుని ఎకరాకు 16 వేల ఎకరాల్లో పంట పండించిన చరిత్ర మాదన్నారు. వైసీపీ పాలన నాటి పరిస్థితులను మన ప్రభుత్వంలో పునరావృతం కానీయొద్దన్నారు. కాలువలను బాగు పడుతున్నాయి. నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరుతున్నామన్నారు. ఆరు తడులతో పంట దిగుబడి పెంచుకునే అంశాన్ని పరిశీలించాలని సూచిస్తున్నామన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.

# అభివృద్ధి పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

గ్రామీణ రహదారులకు మహర్దశ

3.80 కోట్లతో నియోజకవర్గంలో

ప్రారంభం కానున్న రహదారుల నిర్మాణం

160బి హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడు సిఎం చంద్రబాబునాయుడు

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 37 మంది బాధితులకు రూ.42,40,021 చెక్కులు పంపిణీ









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 9)

రాష్ట్ర అభివృద్ధి , పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫిబ్రవరి 15వ తేదీన కందుకూరు నియోజకవర్గం విచ్చేసిన సందర్భంగా దూబగుంట నుంచి కోవూరు గ్రామం వరకు రోడ్డు నిర్మాణంకు 80 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారని ఈ పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని, అదేవిధంగా గ్రామీణ రహదారి పనుల కొరకు నాబార్డ్ నిధులు ద్వారా 3 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు... కేవలం సంక్షేమ కాదు అభివృద్ధి చేసి చూపించేందుకు కూడా కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 160 ఎన్‌హెచ్ హైవేపై ప్రమాదల నివారణకు కందుకూరు పోలీస్ శాఖ అధికారులు, ఆర్టీవో మరియు హైవే అధికారులతో మాట్లాడటం జరిగిందని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసేందుకు చర్యలను తీసుకోవాలని సూచించడం జరిగిందని తెలిపారు. పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాకుండా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సహాయం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలియజేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 37 మంది బాధితులకు రూ.42,40,021 చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మీ కుటుంబానికి ఆసరాగా, ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నియోజకవర్గ బాధిత కుటుంబాలు తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, గోచిపాతల మోషే, కూనం నరేంద్ర, పొడపాటి మహేష్, సవిడిబోయిన వెంకటకృష్ణ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గోవా మద్యం సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

ముంబాయి నగరానికి వెళ్లి అరెస్ట్ చేసిన కంభం ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 9)

ప్రోహిబిషన్,ఎక్సైజ్ స్టేషన్ కంభం నందు నమోదైన సీఆర్ నం.171/2024 కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మహారాష్ట్ర రాష్ట్రంలోని ముంబాయి నగరంలో నివసించే దేవేంద్రన్ వీరప్పన్ శెట్టి అనే ముద్దాయిని డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వుల ప్రకారం కంభం ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్.కొండారెడ్డి , గిద్దలూరు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం.జయ రావు ,వారి సిబ్బంది షేక్.షంషీర్, షేక్. రహమతుల్లా, పి. శ్రీనివాసుతో కలిసి ముంబై నగరానికి వెళ్లి చార్కోప్ పోలీస్ స్టేషన్ వారి సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. సదరు ముద్దాయిని బోరివలిలోని మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరు పరిచి రిమాండ్‌కు హాజరు పరుచు నిమిత్తం మూడు రోజులు అనుమతి తీసుకొని, ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. అనంతరం ముంబై నగరం నుండి బయలుదేరి ఏజేఎఫ్ సీఎం కోర్టు, గిద్దలూరులో ఈ నెల 9వ తేదీన రిమాండ్ నిమిత్తం హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ సదరు ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం తరలించినా, కలిగి ఉన్నా, అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# కిశోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 9)

మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన శుక్రవారం కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల ఆరోగ్యకరమైన, సాధికారిక దిశగా ఆమె వేసి అడుగుకు సమిష్టి కృషితో చేయూతని ఇద్దామని, 11 -18 ఏళ్ల బాలికలకు విద్య ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె శాంతి, ఆశ సీతారావమ్మ, టి పద్మ, గోవర్ధనమ్మ, లక్ష్మీకాంతం, సుభాషిని, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి పట్టణంలో ముమ్మరంగా తనిఖీలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 9)

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పొదిలి పట్టణంలోని మార్కాపురం అడ్డ రోడ్ దగ్గర సిఐ వెంకటేశ్వరు, ఎస్ఐ వి వేమన వాహన తనిఖీ చేశారు. ప్రస్తుతం దేశంలో నెలకున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉన్నాతధికారుల ఆదేశాలు ప్రకారం అనుమానితుల కదిలకల కోసం వాహన తనిఖీలు చేస్తున్నట్టు సిఐ టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎటువంటి వాహనాన్ని వదిలిపెట్టకుండా సీఐ వెంకటేశ్వర్లు ,ఎస్ఐ వేమన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పట్టణంలో ఎవరి మీద అనుమానం అనిపిస్తే మాకు సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ తనిఖీల్లో పొదిలి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ తో ఇంటింటికీ సోలార్ వెలుగులు

## ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు








(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, మే 9)

ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం గురించి అవగాహన కల్పించి వినుకొండ నియోజకవర్గంలో ప్రతి ఇంటినీ సోలార్ వెలుగులతో నింపాలని రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. గ్రామ గ్రామాన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కూటమి పార్టీల కార్యకర్తలు సైతం సూర్య ఘర్ పథకం గురించి అవగాహన కల్పించడంలో భాగస్వాములు కావాలన్నారు. సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే 20 ఏళ్ల వరకూ నిర్వహణ సమస్యలు లేకుండా ఉచితంగా విద్యుత్ పొందవచ్చని, మిగులు విద్యుత్ ను ప్రభుత్వానికి అమ్మడం ద్వారా ఆదాయం కూడా సంపాదించవచ్చన్నారు. వినుకొండ నగరవనంలో పచ్చదనం పెంపొందించడం, నియోజక వర్గం కేంద్రం నలువైపులా గ్రామాలకు రోడ్ల అభివృద్ధి, 17 గ్రామాలకు సురక్షిత నీరు అందించే పథకం పునరుద్ధరణ, అటవీ ప్రాంతాల్లోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక వై కన్వెన్షన్ హాలు నందు వినుకొండ నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, డీఎఫ్వో కృష్ణప్రియ, ఆర్డీవో మధులత మరియు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అటవీ శాఖ, దేవాదాయ శాఖ, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, డ్వామా తదితర శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ 2014-19 కాలంలో పంచాయతీ రాజ్ శాఖలో పనులకు సంబంధించిననిధుల విడుదలపై నెలరోజుల్లోగా స్పష్టత వస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు పీఎం కిసాన్ పథకం అందించడంలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. వేసవిలో అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించి ప్రజలకు తాగు నీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో చర్చించిన నియోజక వర్గ సమస్యలను తర్వాతి నియోజకవర్గ స్థాయి సమావేశం నాటికి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

# సోమిశెట్టి సత్యనారాయణ వ్రత కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)

నెల్లూరు రంగనాయకులపేటలో వైసిపి నాయకులు సోమిశెట్టి రమేష్ కుమారుడి వివాహం అయిన సందర్భంగా సత్యనారాయణ వ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.




# కౌంట్ డౌన్ ప్రోగ్రాం ఆఫ్ ఇంటర్నేషనల్ యోగ డే 2025



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)

100 డేస్,100 ప్రోగ్రామ్స్,100అర్గనైజేషన్‌లో భాగంగా నయాగా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు యగ్నేష్ ఆధ్వర్యంలో ఈ నెల 19న 33వ రోజుగా వైఎంసిఎ గ్రౌండ్లో జరగనున్న యోగ దినోత్సవ వేడుకలకు అనుమతులు ఆహ్వాన నిమిత్తమై మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జిల్లా కలెక్టర్ ఆనంద్ కమిషనర్ మున్సిపల్ నందన్ కలిసి చర్చించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల నయాగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు జనసేన నాయకులు యగ్నేష్‌తో దాదాపు 1000 మంది తో అట్టహాసంగా 33వ కౌంట్ డౌన్ యోగా దినోత్సవంగా వైఎంసిఎ గ్రౌండ్లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయవలసిందిగా కోరారు.





# పి4 స్ఫూర్తితో నెల్లూరులో నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి కృషి

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో నెల్లూరులో పేద కుటుంబాలకు
ఉన్నతవర్గాలు తోడ్పాటు అందించేలా కృషి
విఆర్ కళాశాల పూర్వ వైభవంతో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య
జూన్ 12 నాటికి వెయ్యి మంది పేద విద్యార్థులతో వి ఆర్ స్కూల్ సిద్ధం
అట్టడుగున ఉన్న విద్యార్థులకే ప్రవేశాలు కల్పిస్తాం
మోడల్ స్కూల్‌గా విఆర్‌సిని తీర్చిదిద్దుతున్నాం
వి ఆర్ కళాశాల పునః ప్రారంభంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం
రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)**

నెల్లూరు నగరంలో అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాలను పి-4 విధానంలో భాగంగా దత్తత తీసుకుని, ఆ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం సాయంత్రం మంత్రి నారాయణ వి ఆర్ సి పాఠశాల పునర్నిర్మాణపనులను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల నిరుపేద కుటుంబాలను పి-4 విధానంలో బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సంకల్పం, స్ఫూర్తితో నెల్లూరు నగరంలో అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. నెల్లూరు నగరంలో బంగారు వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు, ఇతర ఉన్నత వర్గాల సహకారంతో ఒక్కొక్క ఉన్నత కుటుంబం ఒక్కొక్క నిరుపేద కుటుంబానికి తోడ్పాటు అందించి, ఆ కుటుంబం సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. తాను కూడా కొన్ని కుటుంబాలను పి4 విధానంలో దత్తత తీసుకుంటానని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ఆర్థికంగా అభివృద్ధి చెంది ప్రథమ స్థానంలో ఉన్న 10 శాతం కుటుంబాలు అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాల అభివృద్ధికి చేయూత ఇవ్వడమే పి-4 ప్రధాన ఉద్దేశంగా మంత్రి వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వి ఆర్ స్కూల్ ను పునః ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఏడాది జూన్ 12 నుంచి అన్ని వసతులు సమకూర్చి పాఠశాలను ప్రారంభిస్తామని, తొలి విడతగా నర్సరీ నుంచి 9వ తరగతి వరకు, వచ్చే ఏడాది పదో తరగతి, ఆపై ఇంటర్ వరకు తరగతులు పెంచుకుంటూపోతామని చెప్పారు. నెల్లూరు నగర నడిబొడ్డులో మూడు షిఫ్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం విఆర్సి పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని అనాథలు, పేదలు, నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తిచేసి జూన్ 12 పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో 1000 మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద వదిలిపెడతామన్నారు. విఆర్సి సమీపంలో దగ్గరగా ఉన్న విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా సైకిళ్లు కూడా ఉచితంగా అందిస్తామని చెప్పారు ఆ విధంగా వచ్చే విద్యా సంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు. అవసరమైతే 5000 వరకు కూడా విద్యార్థులు చేరేలా అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థుల ఆటపాటలకు అనుకూలంగా గ్రౌండ్ లో ఉన్నటువంటి పాత శిథిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మించాలని ఆదేశించామన్నారు. కాలువ కట్టల మీద ఉండే అనాథలు, నిరుపేదలు, బీడీ కార్మికులు, ఇళ్లల్లో పని చేసుకునే వారి పిల్లలను సుమారు 750 మందిని గుర్తించామని, వీరందరికీ కూడా ఈ కళాశాలలో ప్రవేశాలు కల్పించి నిరుపేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తామన్నారు. ఇంకా నిరుపేదల కుటుంబాలు పిల్లలను గుర్తిస్తున్నారని, ఆ కుటుంబాల వివరాలు కూడా పూర్తిగా సేకరిస్తున్నామని మంత్రి చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా అన్ని వివరాలు సేకరించి నిరుపేద బిడ్డలకు వి ఆర్ స్కూల్లో అడ్మిషన్స్ కల్పిస్తామని, పి-4 విధానంలో ఆ కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# యుద్ధ వాతావరణం నేపథ్యంలో వాహన తనిఖీలు
## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్ఐ



**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 9)**

కంభం వై జంక్షన్‌లో ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు అనుమానితుల కదిలకల కోసం వాహన తనిఖీలు చేస్తున్నట్టు సిఐ మల్లికార్జున్, ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఏ వాహనాన్ని వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కంభం పట్టణంలో ఎవరి మీదైనా అనుమానం అనిపిస్తే తమక సమాచారం అందజేయాలని సిఐ మల్లికార్జున్, ఎస్ఐ నరసింహారావు తెలిపారు. వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కేజీబీవీల ఏర్పాటులో రాష్ట్రానికే మోడల్‌గా పల్నాడు

## వినుకొండ, బొల్లాపల్లిలో కేజీబీవీ వసతి భవనాలకు లావు, జీవీ శంకుస్థాపన

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 9)**



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఏర్పాటులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా ఆదర్శంగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడులో 24 వరకు కేజీబీవీలు ఉండటం ఒక రికార్డు అని తెలిపారు. గతంలో పదో తరగతి వరకు ఉండే ఈ విద్యా సంస్థల్లో ఇంటర్ కూడా వచ్చిన తర్వాత ఆదరణ మరింత పెరిగిందని, జిల్లా ప్రజలు ఈ విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని వారిద్దరూ కోరారు. వినుకొండ, బొల్లాపల్లిలో నూతనంగా నిర్మించనున్న కస్తూర్బా గాంధీ బాలికల వసతి భవనాలకు తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. వినుకొండ ఎన్నెస్పీ స్థలంతో పాటు బొల్లాపల్లిలో రూ.2.50 కోట్ల చొప్పున వసతిగృహాలను నిర్మిస్తున్నారు. అందుకు సంబంధించిన శిలాఫలకాలను లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఆడిపిల్లలు అంటే 18 ఏళ్లు వచ్చేసరికి పెళ్లి చేసి పంపిద్దామనే ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు మహిళలకు కూడా ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామని, అందరూ బాలికలను చదవించాలన్నారు. ఇంటర్‌లో 70 శాతానికిపైగా మార్కులు వచ్చిన ఎస్టీ బాలికలకు విజ్ఞాన్ విద్యా సంస్థల్లో ఉచితంగా ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వరికపూడిశెల ప్రాజెక్టును తప్పనిసరిగా పూర్తి చేస్తామని, అందుకు సంబంధించి నిధుల సమీకరణకు తమ ఆలోచనలను సీఎం చంద్రబాబు ముందుంచామని, ఆయన కూడా చాలా సానుకూలంగా స్పందించారని, త్వరితగతిన ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. అనంతరం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ బొల్లాపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాల నిర్మాణానికి రూ.2.50 కోట్లు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వినుకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన, కరవుపీడిత ప్రాంతాల్లో ఒకటైన బొల్లాపల్లికి ఇలాంటి విద్యా సంస్థలు ఒక వరమన్నారు. వైసీపీ పాలనలో విద్యతో పాటు పిల్లల భవిష్యత్తును కూడా గాలికొదిలేశారని, ఐదేళ్ల పాలనలో విద్యార్థులు, విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ఒక్క భవనం కూడా కట్టలేదని ఆక్షేపించారు. మంత్రి లోకేష్ విద్యా సంస్థలను ఆధునిక విద్యాలయాలుగా తీర్చిదిద్దుతున్నారని, అందుకు కావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు సమకూరుస్తున్నారని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంచడానికి అన్ని విధాల కృషి చేస్తున్నారని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలను పెంచుతున్నారని, పిల్లలు చదువుకోవడానికి కావాల్సిన అన్ని వసతులతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దుతున్నారని జీవీ ఆంజనేయులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







# లేఅవుట్లలో ఓపెన్ స్థలాలు ఆక్రమిస్తే తాటతీస్తాం

ప్రజా ప్రయోజనం కోసం వదిలిన స్థలాలను
పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదే
సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి








**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)**

పొదలకూరులోని సత్యనారాయణ లేఅవుట్ ఓపెన్ స్పేస్ పరిశీలన సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సత్యనారాయణ లేఅవుట్ లోని సుమారు రూ.4 కోట్ల విలువైన 286 అంకణాల ఓపెన్ స్పేస్ కు ప్రహరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం ఆదేశించారు. స్థలాన్ని ఎవరు ఆక్రమించే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఆ స్థలంలో పార్కు నిర్మాణానికి హామీ ఇచ్చారు. లేఅవుట్ల నిర్మాణం సందర్భంగా కొందరు అక్రమాలకు పాల్పడటం సరికాదన్నారు. 10 శాతం ఓపెన్ స్పేస్ వదలకుండా కొందరు లేఅవుట్లు వేస్తే, మరికొందరు ఓపెన్ స్పేస్ ను మొదట చూపి చివరలో అమ్మేసుకుంటున్నారు. ప్రజాపయోగ స్థలాలను పరిరక్షించాల్సిన పొదలకూరు పంచాయతీ కార్యదర్శి రెండు రకాలుగా రిపోర్టులు పంపి సస్పెన్షన్ వేటుకు గురయ్యాడు. సత్యనారాయణ లేఅవుట్లోని 286 అంకణాల స్థలం ఓపెన్ స్పేస్ అని కోర్టు స్పష్టం చేసింది. మరో దొంగ పత్రం సృష్టించి భూఆక్రమణకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. పిల్లలు ఆడుకోవడానికి, బడి, గుడి కట్టుకోవడానికి ఓపెన్ స్పేస్‌లు ఉండాల్సిందేవాటిని పరిక్షించుకునే బాధ్యతను అధికారులతో పాటు ప్రజలు కూడా తీసుకోవాలన్నారు.


# కనిగిరిలో ఘనంగా శ్రీ పోలేరమ్మ తల్లి కలశ ఉత్సవం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 9)**

కనిగిరి పట్టణంలోని శ్రీ దొంతులమ్మ ఆలయంలో కొలువైన శ్రీ పోలేరమ్మ తల్లి కలశ ఉత్సవ కార్యక్రమం శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ కోవెల నుండి మహిళలు 108 కలశాలలో పవిత్ర గంగ జలాలను నింపుకొని ప్రదర్శన చేపట్టారు. అనంతరం శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయానికి చేరుకొని, పవిత్ర గంగా జలాలతో అమ్మవారిని అభిషేకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ టంగుటూరి గోవిందరావు, కొప్పరపు కోటేశ్వరరావు, ముండ్లమూరి మాలకొండయ్య, వాకమల్ల కిషోర్ కుమార్, ఇన్నమూరి సుబ్బారావు ఆంద్ర శ్రీనివాసులు, కంచర్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)**

నెల్లూరు రంగనాయకులపేట బులియన్ మర్చంట్స్ ఫంక్షన్ హాల్లో జరిగిన బారసాల కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ , ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై.. ఆర్యవైశ్య నాయకులు సాదు నాగార్జున కుమారుడు చిన్నారి నిడ్ విత్ కార్తికేయను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడకు విచ్చేసిన, పలువురిని కలుసుకొని చంద్రశేఖర్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు.

## ఎమ్మెల్యే ఇంటూరిని మర్యాదపూర్వకంగా కలిసిన బెజవాడ కృష్ణయ్య





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 9)

కందుకూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల కందుకూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన బెజవాడ కృష్ణయ్య ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించేందుకు సహకరించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పండిట్ సంపత్ కుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.

## సీపీడీసీఎల్ డిస్కం సిఎండీ పుల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఏపీఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 9)

సీపీడీసీఎల్ డిస్కం సిఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి పుల్లారెడ్డిని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 తరపున శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సమయంలో పూల మొక్కతో శుభాకాంక్షలు తెలిపారు. డిస్కం అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు, కార్యదర్శులు ఎన్ శర్మతో పాటు డిస్కం కార్యవర్గ సభ్యులందరూ, వివిధ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సిఎండి మాట్లాడుతూ 1104 కార్మికులందరూ కష్టపడి పనిచేసే సంస్థని అభివృద్ధి బాటలో నడిపించాలని కార్మికుల యొక్క సమస్యల పై గత సంవత్సరం కాలం నుండి ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే నియామకాలు చేపడతామని తెలియజేశారు. ఓ ఎం కార్మికులు డిప్లమో అర్హత కలిగి సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నటువంటి జేఈ కన్వర్షన్స్ పరిశీలిస్తానని న్యాయం చేస్తానని తెలిపార. అలాగే సీపీడీఎస్‌సీఎల్ డైరెక్ట్ టెక్నికల్ మురళీ కృష్ణ యాదవ్‌ని కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పెద్ద వెంకన్నపాలెంలో వివాహ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పోతుల



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 9)

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పోతల రామారావు డాక్టర్ లక్ష్మీ తేజ, బాలకృష్ణల వివాహ కార్యక్రమానికి హాజరై వధూ వరులను అక్షింతలు వేసి వారిని దీవించారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పల్లపోతు రమేష్ బాబు, నల్లమోతు రమణయ్య వైఎస్ఆర్సిపి నాయకులు నవులూరి మధుబాబు, కంచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికో పారిశ్రామికవేత్త.. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధే లక్ష్యం

### బొల్లాపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి లావు, జీవీ ఆంజనేయులు శంకుస్థాపన







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 9)

అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి, ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యం దిశగా ప్రతి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఎంఎస్ఎంఈల పార్కులు ఏర్పాటు చేస్తుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఐదేళ్లలో 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీ మేరకే సీఎం చంద్రబాబు పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారని వారిద్దరూ తెలిపారు. ఆ పారిశ్రామిక ప్రగతిలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భారీగా అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. బొల్లాపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. మొత్తం 70 ఎకరాల్లో రూ.7 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానుంది. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. బొల్లాపల్లిలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కు ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని లావు శ్రీకృష్ణదేవరాయలు విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంలో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పుతున్నారని, మొదటి విడతగా 1,455 ఎకరాల్లో రూ.595 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు విద్యుత్ సహా పలు విభాగాల్లో మహిళలకు ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు కల్పిస్తుందన్నారు. మన పల్నాడు ప్రాంతంలో కూడా అనేకమంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని, అలాంటివారంతా ముందుకొచ్చి ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తే అనుమతులు కూడా వేగవంతంగా వస్తాయని జీవీ ఆంజనేయులు తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు మంత్రి లోకేష్ మరో అడుగు ముందుకు తీసుకెళ్లారని, 2000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శ్రీ సిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు లోకేష్ భూమిపూజ చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులను నిర్లక్ష్యం చేసిందని, పరిశ్రమల విషయంలో వైసీపీకి ఒక విధానం అంటూ లేదని, అభివృద్ధి వ్యతిరేక పరిపాలన సాగించిందని మండిపడ్డారు. కొత్త పెట్టుబడులను రానివ్వలేదని, ఉన్న పరిశ్రమలను కూడా తరిమేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. స్థానికంగా చదువుకున్న యువతను కూడా ప్రోత్సహించి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయాలనే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టామని, వారికి ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.కోటి వరకు రాయితీ రుణాలు ఇస్తోందని, ఈ అవకాశాన్ని ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటులో గత ప్రభుత్వం తెచ్చిన అర్థంలేని నిబంధనలు తొలగించి సులభంగా అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి

### గృహ నిర్మాణ శాఖ అధికారులకు కలెక్టర్ ఆనంద్ సూచన



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)

పేదల గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ వారి చాంబర్లో ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణ దశలను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆప్షన్ – 3 కింద లబ్ధిదారులకు కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఇంజనీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నల్ల రేగడి నేలల్లో నిర్మిస్తున్న ఇళ్ల పునాదుల నాణ్యతను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి సర్టిఫై చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు లేని ఇళ్లను ముందుగానే గుర్తించి పునాదులను దృఢంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు పటిష్టంగా నిర్మించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పరిశీలించేందుకు ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. పీఎంఏవై ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నూతన ఇళ్ళ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల ఎస్ ఈలు గంగాధర్, వెంకటరమణ, విజయన్, అశోక్ కుమార్, డిఇలు జహీరుద్దీన్, నారాయణరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి నాయకులు ఉదయ్ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 9)

నెల్లూరు ఏసీ నగర్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ , ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 11వ డివిజన్ వైసిపి నాయకులు ఉదయ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నూతన గృహప్రవేశం చేసిన ఉదయ్ కుటుంబ సభ్యులకు చంద్రశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

### భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలి

### అధికారులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 9)

శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ నెల 17వ తేదీన శనివారం జరగనున్న ఈ జయంతి ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా హాజరయ్యే అవకాశమున్నందున, వారి కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. ఈ జయంతి వేడుకలు వైభవంగా, భక్తులందరికీ సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు ఉండాలి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**భక్తుల సౌకర్యానికి ప్రత్యేక చర్యలు** : ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, శుభ్రత మరియు దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదనంగా, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. ఈ పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి సాగర్ బాబు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు,పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ అధికార ప్రతినిధి షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com